15022024-MAI-06_Layout 1 2/15/2024 1:52 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# నల్లగొండలో జలగర్జన

**అడుగడుగునా** గండాలు, జటిలమైన పోరాటాలు ఆయనకు కొత్తకాదు. సంకటం ఎదురైనప్పుడు వెనుదిరగడం ఆయన చరిత్రలోనే లేదు. మునుముందుకు సాగిపోయి ప్రత్యర్థులను మట్టి కరిపించిన ఘనత తనది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు, తనకు శారీరకంగా కలిగిన అవస్థలు ఇవేవీ కేసీఆర్‌ను నిలువరించలేకపోయాయి. పడిన ప్రతిసారీ లేవడం తనకు తెలుసు. ఓటములను విజయసోపానాలుగా మలుచుకున్న దీక్షాదక్షతలు తన సొంతం. అందుకే ఆయన కదిలారు. అశేష జనవాహినిలోకి దూసుకుపోయారు. నల్లగొండ సభలో సమరభేరి మోగించారు. కాంగ్రెస్ సర్కారు నీటిపై వల్లిస్తున్న బూటకాలను బదాబదలు చేశారు. కృష్ణా ప్రాజెక్టులను చేజార్చుకుంటున్న చేతకానితనాన్ని ఎండగట్టారు. రెట్టించిన సమరోత్సాహంతో, తనదైన వాగ్ధాటితో విజృంభించారు. ఆయన ప్రతి పలుకు ప్రత్యర్థుల గుండెల్లో దట్టించిన మందుగుండులా పేలింది. తెలంగాణ ప్రబోధకుడు, ప్రగతి సాధకుడు పూరించిన సమరశంఖం పార్టీకి, కార్యకర్తలకు కొండంత ధైర్యం కలిగించింది. ప్రజలకు దిశానిర్దేశం చేసింది. నల్లగొండ సభ బీఆర్ఎస్ పయనంలో ఓ మూల మలుపు. పార్టీ పునరుజ్జీవన ప్రస్థానంలో తొలి గెలుపు.

అసెంబ్లీ సాక్షిగా అసత్యాలతో, అర్ధసత్యాలతో బట్టకాల్చి మీదేసే దిక్కుమాలిన రాజకీయం కేసీఆర్ గర్జనతో బిక్కచచ్చింది. నీటిపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న వదరుబోతులకు కేసీఆర్ మరోసారి ప్రజాక్షేత్రంలోకి రావడంతోనే బెదురు పుట్టింది. స్వరాష్ర్టాన్ని సాధించి దాదాపు పదేండ్ల పాటు ప్రగతి మార్గం పట్టించిన జననేత సరైన సమయంలో, సరైన వ్యూహంతో ప్రజల ముందుకురావడం విశేషం. తెలంగాణకు ప్రాణాధారమైన కృష్ణా నీటి హక్కుల పరిరక్షణకు నడుం బిగించడం ముదావహం. రాష్ట్ర సాధన ఉద్యమానికి మూలాధారమైన మూడు అంశాల్లో నీటిదే ప్రథమస్థానం అన్న సంగతి తెలిసిందే.

అమలు చేయలేని హామీలతో ఊదరగొట్టి, బురదజల్లుడు రాజకీయాలతో బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆడలేక మద్దెల ఓడంటున్నది. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఇదివరకటి ప్రభుత్వంపై నిస్సిగ్గుగా నిందలు వేస్తున్నది. కేసీఆర్‌పై విషం చిమ్మి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నది. ముఖ్యంగా ప్రాజెక్టుల్లోని చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో చూపిస్తూ హడావుడి చేస్తున్నది. మరోవైపు కృష్ణా ప్రాజెక్టులను అవగాహనారాహిత్యంతో, కొంత నిర్లక్ష్యంతో కేంద్రం చేతికి అప్పగించి ఆపై బుకాయింపులకు, దబాయింపులకు దిగుతున్నది. నీటి హక్కుల విషయంలో నిలకడలేని తనం చాటుకుంటున్నది. ఇది తెలంగాణకు ముప్పు తెచ్చే ధోరణి. నిలువరించక తప్పదనే కేసీఆర్ కదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల తెలివిమాలినతనాన్ని నల్లగొండ సభలో అద్వితీయమైన రీతిలో తూర్పారబట్టారు. నాటుమాటల కాంగ్రెస్ నేతలకు దీటుగా సమాధానమిచ్చారు.

తెలంగాణ ప్రజానీకం అప్రమత్తంగా లేకపోతే కేసీఆర్ హెచ్చరించినట్టు నీటిహక్కులు ఆగమై రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు నాటి కన్నీటి బతుకులు మిగులుతాయి. మతిలేని పాలకుల గతిలేని విధానాలపై విరామమెరుగని పోరాటమే శరణ్యం. కృష్ణా ప్రాజెక్టుల రక్షణకు, నీటి హక్కుల సాధనకు తెలంగాణ ప్రజానీకం ఒక్కతాటిపై కదలాల్సిన సమయం ఆసన్నమైంది.

# చెరగని గుర్తులే చరిత్ర

చర అంటే కదిలేది అని అర్థం. చరించేది చరిత్ర. జరిగిపోయినది చరిత్ర. అయితే ఆ కదలికలో చాలా గుర్తులు చెరపలేనివిగా మిగులుతాయి. ఆ మిగిలినవే తర్వాతి తరాలకు తెలుస్తాయి. మనం చేసిన పనులే చరిత్రను చెప్తాయి. అంతేకానీ, మనం మాట్లాడిన మాటలు కాదు, అవి గాలిలో కలిసిపోతాయి. అయితే, ఈ చరిత్రకు ఎందుకు విలువ ఉంటుంది? అన్నీ విషయాలు లేక పాఠ్యాంశాలు పాఠాలు నేర్పిస్తాయి. కానీ, చరిత్ర గుణపాఠాలు నేర్పిస్తుంది. అంటే, జరిగిన విషయాలు గమనించి, తప్పులు గ్రహించి, వాటిని దిద్దుకుంటే ఎవరికైనా భవిష్యత్తు బాగుంటుంది.

అంతేకానీ, ఎన్ని జరిగినా 'నేనింతే' అంటూ ముందుకుపోతే చరిత్ర వారిని క్షమించదు. అంతేకాదు, 'జరిగినది చెరిపేయగలను' అనుకుంటే కూడా చరిత్ర ఆ మనిషిని చూసి నవ్వుకుంటుంది. ఉదాహరణకి బహమనీ రాజుల చరిత్ర చూస్తే.. రాజ్యాలను ఏలుతున్న తమ తండ్రులను చంపి వారిలో చాలామంది రాజులయ్యారు. అలాగే మొఘలు వంశంలో చివరి బలవంతుడైన రాజు ఔరంగజేబు తన అన్నదమ్ములను చంపి, తండ్రిని ఖైదు చేసి రాజయ్యాడు. ఇలా చరిత్రలో శాశ్వతంగా లిఖితమైన, జరిగిపోయిన చరిత్ర గుర్తులు చెరగాలంటే, చెరిపేద్దామంటే సాధ్యం కాదు.



కనకదుర్గ దంటు
89772 43484




మన రాష్ట్రంలో జరిగిన ఘటనే అందుకు చక్కటి ఉదాహరణ. దాదాపు 4 దశాబ్దాల తర్వాత కూడా అప్పట్లో జరిగిన ఆ ఘటనను ప్రజలు మర్చిపోలేదు. అదే నారా చంద్రబాబునాయుడు వెన్నుపోటు ఉదంతం. ఇప్పటికీ చంద్రబాబును 'వెన్నుపోటుదారుడు' అని అంటున్నారు కదా! మామని గద్దె దించి అధికార పీఠమెక్కిన బాబు.. తానెంతో గొప్ప పరిపాలకుడినని చెప్పుకొన్నా, 55 ఏండ్ల రాజకీయ జీవితంలో 14 ఏండ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని పదేపదే చెప్పుకొన్నా, వీటన్నిటితో పాటు ఆయన మొట్టమొదటి బిరుదు కూడా అలాగే శాశ్వతంగా ఉంటుంది. అదీ చరిత్రకున్న బలం.

చరిత్ర ఎలా నిర్మితమవుతుందో చెప్పాలంటే.. 'ఒక గోడ కట్టినట్టు' అని చెప్పాల్సి ఉంటుంది. ఇటుక మీద ఇటుకను పేర్చి ఆ గోడను కడతారు కనుక, మధ్యలో కొన్ని ఇటుకలు తీసేయాలంటే కుదరదు. ఇక దానిపై చరిత్ర నిలవదు. గ్రీకు భాష నుంచి తీసుకున్న హిస్టరీ అనే పదమే చరిత్ర. చరిత్ర (హిస్టరీ) అన్న పదానికి వ్యుత్పత్తి (పుట్టుక) అర్థం చూస్తే.. 'ఒక తెలివైన మనిషికున్న విజ్ఞానం' అని అర్థం వస్తుంది. అంటే సామాన్యుల కంటే భూతకాలపు సంఘటనలు తెలిసిన మనిషికున్న జ్ఞానం అని దాని అర్థం. భూతకాలపు అవగాహన ఉన్నవాళ్లని తెలివైనవాళ్లు అని, ఆ కాలపు సంఘటనలను వర్తమానంతో బేరీజు వేసి, భవిష్యత్తుని ఊహించి చెప్పగలిగినవాళ్లని మేధావులని భావిస్తాం. భూతకాలపు గుర్తులను చెరిపి, ఇప్పటినుంచే ఈ లెక్క అని ఎవరైనా అంటే.. అది లెక్కలోకి వచ్చే అంశంగా ఉండదు. విజ్ఞానం, వివేచన ఉన్నవారెవరూ ఆ మాట అనరు. త్రేతాయుగపు శ్రీరాముడి చరిత్ర, ద్వాపరయుగపు శ్రీకృష్ణుడి చరిత్ర ఇంకా చదువుకుంటున్న మనం.. నిన్నమొన్నటి తెలంగాణ చరిత్ర మర్చిపోతామా? తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో మెజారిటీ సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తమ పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నది. 2023 డిసెంబర్ 7న పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన రాజకీయాల్లో సంచలనాలు సృష్టిస్తున్నారు. అయితే ఆయనకు ఒక విషయం తెలియనట్టున్నది. ఏదైనా రాయాలంటే ఖాళీ పేపర్ మీద అయితే త్వరగా మనం అనుకున్నది రాయగలం. కానీ, అప్పటికే రాసి ఉన్న పేపర్‌పై అక్షరాలను చెరిపి రాయాలంటే సరిగ్గా దానికి రెండింతల సమయం పడుతుంది. అంటే ఐదేండ్ల కాలం కేవలం రెండున్నర సంవత్సరాలుగా మారుతుంది. అది చాలా నష్టాన్ని కలిగిస్తుంది ఒక రాజకీయ నాయకుడికి.

> ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి గ్రహించాల్సిన ఇంకొక ముఖ్యమైన విషయం ఉన్నది. అదేమిటంటే, ప్రపంచంలోని రచయితల్లో గొప్పవాడిగా పేరొందిన షేక్‌స్పియర్ ఒక విలువైన మాట అన్నారు. 'పేరులో ఏముంది? గులాబీ పువ్వుకి ఇంకో పేరు పెట్టినా దాని పరిమళం మారుతుందా?' అని. అంటే 'రైతుబంధు' పథకానికి రైతుభరోసా అని లేదా ఇంకో పేరు పెట్టినా కూడా.. ఆ పథకాన్ని సృష్టించి అన్నదాతలను ఆదుకున్న రైతు బంధువుగా దేశ చరిత్రలో కేసీఆర్ పేరే ఉంటుంది.

పేరేదైనా సరే, అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినప్పటికీ కనీసం ఆ ధనసహాయాన్ని ఇవ్వకుండా భరోసా పోగొట్టుకున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు కూడా చరిత్రలో లిఖితమవుతుంది. చరిత్రకున్న విశేష లక్షణం ఏమిటంటే, మంచీచెడూ అన్నిటినీ శాసనాలుగా శాశ్వతం చేస్తుంది. కాబట్టి, బంధు-భరోసా, ధరణి-భూమాత, ఉచిత కరెంటు-గృహజ్యోతి, మహిళలకు పింఛన్-మహాలక్ష్మి.. ఇలా ఏ పేర్లు పెట్టినా ఆ పథకాలు అమలైన తీరును మాత్రమే చరిత్ర లిఖిస్తుంది కానీ, బహిరంగ సభల్లో చెప్పిన మాటలను కాదు. ఆ మాటలు ఆ ఉపన్యాసాల వరకే ఉంటాయి.

అయితే ఇప్పుడు తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా తమ రాష్ట్రం తమకే ఉండాలనుకునేవారు ఒక్క విషయం అర్థం చేసుకోవాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత కేసీఆర్ 'తెలంగాణ స్టేట్- టీఎస్' అని పేరు పెట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయింది కాబట్టి స్టేట్ అని అర్థం వచ్చేలా ఆయన ఆ పేరు పెట్టారు. మరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి 'టీజీ' అని ఎందుకు మార్చాలనుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. టీజీ అంటే తెలంగాణ అని మాత్రమే అర్థం వస్తుంది. అప్పుడు రేవంత్‌రెడ్డి, ఆయన గురువు చంద్రబాబు వేసిన పథకాన్ని ప్రయోగించడం తేలికవుతుంది. అదేమిటో చూద్దాం! రెండు నెలల్లో ఏపీలో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ప్రజల ఖర్మకాలి టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారనుకోండి. దేశం దశ బాగోలేనట్టుంది కనుక కేంద్రంలో మళ్లీ బీజేపీయే అధికారంలోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు జరిగాయంటే.. ముప్పేట నాయకులు - నరేంద్రమోదీ, రేవంత్, చంద్రబాబు కలిసి ఆంధ్రా, తెలంగాణ రాష్ర్టాలను ఒక్క రాష్ట్రంగా మార్చే వీలుంటుంది. అప్పుడు ఈ ప్రాంత ప్రజల కండ్లు తుడవడానికి రాష్ర్టానికి ఉమ్మడిగా ఆంధ్రా-తెలంగాణ అని పేరు పెడతారు. 1955లో పెద్ద మనుషులు (?) మొదటగా నిర్ణయించుకున్నట్టు. ఇది జరుగుతుందా అని షాకవకండి. 2014లో కేసీఆర్ ప్రమాణస్వీకారం కూడా చేయకుండానే ఏడు మండలాలను తెలంగాణ నుంచి లాక్కొని ఆంధ్రాలో కలిపితే ఏం చేయగలిగాం? అందుకే ఇప్పుడూ ఆ ముగ్గురు అలా చేస్తే ఏమీ చేయగలమో ప్రజలు ఆలోచించాలి.

అందుకే వచ్చే పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ ప్రజలకు చాలా ముఖ్యం. అఖండ మెజారిటీతో బీఆర్ఎస్ సభ్యులను గెలిపిస్తే.. తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వాన్ని, ప్రత్యేక రాష్ర్టాన్ని నిలబెట్టుకోగలుగుతారు. జాగ్రత్త! ఈసారి ఓటు వేయడంలో పొరపాటు జరగకూడదు. తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌ను గెలిపించండి. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ఆపండి. స్వతంత్రతను కాపాడుకోండి.



## ఆగమవుతున్న ఆటోవాలా

> 'నాలాగే నా కొడుకు కూడా ఆటో నడపకూడదంటే మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి' అంటూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఊదరగొట్టింది. ఓ ఆటో డ్రైవర్‌తో ఈ మేరకు వీడియో చేయించి సోషల్ మీడియాలో దాన్ని విపరీతంగా షేర్ చేసింది. ఎన్నికలు ముగిశాయి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వస్తూనే ఆటోవాలాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది.

ఆటోలు నడుపుకొంటూ బతుకీడుస్తున్న చాలామంది జీవితాలపై కాంగ్రెస్ దెబ్బ కొట్టింది. మార్పు అంటూ గద్దెనెక్కిన హస్తం సర్కార్ తీసుకొచ్చిన మొదటి మార్పు ఆటోవాలాల జీవితాలను సమూలంగా మార్చేసింది. అది అలాంటిలాంటి మార్పు కాదు. రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేసిన మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటోవాలాలు ఆగమైపోయారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన మొదటి రోజు నుంచే మార్పు అంటే ఏంటో ఆటో డ్రైవర్ల ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. మహిళలెవరూ ఆటోల దిక్కు చూడటం లేదు. మహిళలకు ఉచితం కావడంతో వారితో పాటే కుటుంబంలోని పురుషులు కూడా బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో గిరాకీలు లేక ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయి. ఉచిత బస్సు రూపంలో ఊహించని విపత్తు తమ బతుకులను ఆగం చేయడంతో ఏం చేయాలో తెలియక అనేక మంది డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారిలో 30 ఏండ్లలోపు వారు, పెండ్లికాని యువకులే ఎక్కువ మంది ఉండటం ఆందోళనకరం.

జీవనాధారం కోసం ఎక్కువమంది అప్పులు చేసి, లోన్లు తీసుకొని ఆటోలను కొంటుంటారు. ఆదాయం లేకపోవడంతో ఈఎంఐలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు ఎక్కువ కావడం బాధాకరం. కుటుంబ ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులు, ఆటో ఈఎంఐలు, ఇతర ఈఎంఐలు.. ఇలా ఒక్కసారిగా ఆర్థిక సమస్యలు చుట్టుముడుతుండటంతో మనోధైర్యాన్ని కోల్పోయి ఇప్పటివరకు 21 మంది తనువు చాలించారు.

ఆదుకుంటుందనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. గతేడాది డిసెంబర్ 23న సీఎం రేవంత్‌రెడ్డితో ఆటో డ్రైవర్లు సమావేశమయ్యారు. తమ గోడును వెళ్లబోసుకున్నారు. వ్యథనంతా విన్న రేవంత్‌రెడ్డి విచిత్రంగా.. ఆటో డ్రైవర్లు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామనడంతో వారంతా నిర్ఘాంతపోయారు. తమ బతుకుదెరువుకు భరోసా ఇస్తారనుకుంటే.. చనిపోయిన తర్వాత సాయం చేస్తామనడం ఏమాత్రం సమంజసంగా లేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి వివిధ యూనియన్లు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. నెలకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

అదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఆటోడ్రైవర్లకు అండగా నిలుస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నది. ఆటోవాలాల సమస్యలు, వారి స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. ఆటో డ్రైవర్లకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఆటోల్లోనే అసెంబ్లీకి వెళ్లి మద్దతుగా నిలిచారు. అసెంబ్లీలోనూ ఆటో డ్రైవర్ల గురించి ప్రస్తావించారు. అయితే, అదంతా డ్రామా అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటోవాలాల ఆత్మహత్యలను కొట్టిపారేయడం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరును స్పష్టం చేస్తున్నది.

గత ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేసినట్టే.. ఆటోల రుణమాఫీ చేసి ఆదుకోవాలి. తద్వారా కొంత భారం తగ్గుతుంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు అందించి ఆత్మహత్యలను నివారించాలి. చనిపోయిన ఒక్కో డ్రైవర్ కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం చేయాలి. మానవీయ కోణంలో ప్రభుత్వం ఆలోచించాలి. ఆటో డ్రైవర్ల బతుకులకు ఊతం ఇచ్చే విధంగా తక్షణమే పై మూడు చర్యలు చేపట్టాలి.



అంజి గోపి
89788 37933

# పార్లమెంట్ ఎన్నికల వేళ కొత్త పాచికలు



బి.నర్సన్
94401 28169

> ఎన్నడూ వల్లించని పేర్లతో పాలకులు ఇప్పుడు కొంగ జపం మొదలుపెట్టారు. గాలివాటం చూసి గింజలు తూర్పారబట్టినట్టు ఎన్నికల ముందు ఓట్లు రాల్చే పేర్లను తెరపైకి తెస్తున్నారు. అవార్డులు, గౌరవాలు ఇస్తున్నవారి అంతరంగం ఏమిటో తెలిసినా.. ఇదే మహాభాగ్యమన్నట్టు కొందరు మేధావులు సైతం పాలకుల నిర్ణయాలకు జేజేలు పలుకుతున్నారు. ఈ అవార్డులతో బడుగుల బతుకులే మారిపోయినట్టు ఆయా కవి గాయక అభిమానులు సంబురపడిపోతున్నారు. ప్రత్యేక గౌరవాన్ని అందుకుంటున్న వారి ఆశయాలు నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టకుండా, వారి పేరిట అవార్డులు, విగ్రహాలు, గీతాల గుర్తింపులు ఇస్తూ.. తమ రక్తపు మరకల చేతుల్ని కడిగేసుకోవాలని, ఆయా వర్గాలకు దగ్గరవ్వాలని ప్రభుత్వాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి.

మహాత్మాగాంధీ బొమ్మను గోడకు తగిలించి రోజూ దండం ఎందుకు పెడుతున్నావు అని ప్రశ్నిస్తే.. 'మహాత్మా నీ బాటలో నడవడం మా వల్ల కాదు, మన్నించమని కోరడం కోసం' అని అన్నాడట ఓ ప్రబుద్ధుడు. ఇప్పటి ప్రభుత్వాలు గొప్పవారి పేర్లు తలుచుకుంటే అది నిజమేననిపిస్తుంది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కంటే.. గత ప్రభుత్వ నిర్ణయాలను 'మార్పు' చేయాలనే దానిపైనే ఎక్కువగా దృష్టిసారిస్తున్నది. అవసరం ఉన్నా, లేకున్నా చెరిపేసే ప్రయత్నం చేస్తున్నది. వాహనాల రిజిస్ట్రేషన్‌కు రాష్ట్ర సంకేతంగా టీఎస్ అని ఉంటే మునిగేదేమీ లేదు. టీజీ అని మార్చడం వల్ల ఒరిగే ప్రయోజనమూ లేదు. ఈ నిర్ణయాలు చూస్తుంటే 'నువ్వు ఎస్ అన్నవాటికి నేను నో అంటా' అన్న చందంగా ఉంది.

ఈ మార్పుల జాబితాలో తెలంగాణ తల్లి విగ్రహం, ప్రభుత్వ లోగో కూడా ఉన్నాయి. తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖల విషయంలో ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదు. తల్లిని దైవ సమానంగా భావిస్తాం కాబట్టి ఆభరణాలు ఉండటం సబబేనన్న మాటలు అందరినీ సంతృప్తి పరిచాయి. 'తెలంగాణ ఆడబిడ్డలు కిరీటాలు, వడ్డాణాలు పెట్టుకోరని, ఈ నేల తల్లి చాకలి ఐలమ్మలా ఉండాలి' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. చరిత్ర తెలిసి దాన్ని మభ్యపెట్టే మాటలు అనడం ఈ మధ్య నాయకులకు అలవాటైపోయింది. చాకలి ఐలమ్మ చరిత్రను వెలుగులోకి తెచ్చిన ఘనత ప్రగతిశీలవాదులకు చెందుతుంది. చాకలి ఐలమ్మ కష్టాలకు కారణమెవరు? ఆమె మద్దతుగా నిలిచిన కమ్యూనిస్టులను కాల్చి చంపిందెవరు? తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసిన అధ్యాయాలు చరిత్ర పుస్తకాల్లో ఇప్పటికీ ఉన్నాయి. అవన్నీ మరుగునపడేసి ముఖ్యమంత్రి నేడు నీతులు వల్లించడం అసహ్యంగా ఉంది. తెలంగాణ రాకుండా తాత్సారం చేసి, వందలాది బిడ్డల బలిదానానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అందెశ్రీ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం, గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇస్తామనడం ఈ నేల చేసుకున్న దౌర్భాగ్యం. అందెశ్రీ గీతానికి ఈ గౌరవం ఎన్నటికైనా దక్కాల్సిందే. అందెశ్రీ గీతాన్ని గౌరవించడమంటే రాష్ట్రం తనను తాను గౌరవించుకోవడమే.


గద్దర్ గొప్ప వాగ్గేయకారుడు, మేధావి. అయితే ఆయన ప్రాథమికంగా విప్లవవాది. కాంగ్రెస్, తెలుగుదేశం పాలనలో ఆయన నిషిద్ధ సాయుధ పార్టీ మద్దతుదారు. గద్దర్ చనిపోయిన ఆరు నెలలకు ఆయన శవంపై రాజకీయాలు మొలుస్తున్నాయి. దళితుడైన ఆయన పేరును ఎంత తలిస్తే అంత లాభమనే పాచికని రేవంత్ వాడుతున్నారు. సినిమా వాళ్లకు ఇచ్చే నంది అవార్డులను గద్దర్ పేరిట ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. నిజానికి సినిమా కళాకారులకు నంది అవార్డులు ఇవ్వడం పదేండ్ల కిందటే ఆగిపోయింది. నేడు మన మధ్యలేని గద్దర్‌ను గౌరవించడం వేరు, సినిమావాళ్లకు అవార్డులు ఇవ్వాలనుకోవడం వేరు. రెండింటి ముడివేతకే పొంతన కుదరడం లేదు. గద్దర్‌ను గౌరవించాలనుకుంటే.. ఆయన పేరిట స్మారక మందిరం కట్టొచ్చు, ఏదైనా నిర్మాణానికి ఆయన పేరు పెట్టవచ్చు. ఉత్తమ దళిత విద్యార్థులకు పతకాలు, పారితోషికాలు ఇవ్వవచ్చు. అసలు విషయానికొస్తే.. రేవంత్ నోట పదేపదే గద్దరన్న అని వినిపిస్తున్నది. ఆయన గద్దర్‌ను కలిసిన సందర్భాలెన్ని? గద్దర్‌పై బుల్లెట్ల దాడిని ఖండించారా? ఆపత్కాలంలో ఇంటికెళ్లి కలిశారా? అవేవీ లేనప్పుడు ఒక్కసారి ఇంత ప్రేమ కురిపించడమెందుకు?



> ఎన్ని మాట్లాడినా అది కాంగ్రెస్ పార్టీయే. వెంగళరావు నుంచి వైఎస్ఆర్ దాకా పౌరహక్కులు కాలరాసిన పార్టీయే. పౌరహక్కుల కోసం ఉద్యమించిన కోదండరాం.. అదే కాంగ్రెస్ పార్టీ పంచన చేరడం ఆశ్చర్యంగా ఉంది. తెలంగాణ సాధన కోసం ఎవరిని నిందించారో.. వారితో చేతులు కలపడం వెనుక స్వీయ ప్రయోజనమే ఉంది. ఆయన పెట్టుకున్న పార్టీ మండలి రికార్డుల్లోకి ఎక్కుతుంది. అదో తృప్తి.

కోదండరాం ఎమ్మెల్సీ అయినా, విద్యామంత్రి అయినా ఆయన ప్రతీ నిర్ణయం ముఖ్యమంత్రి గీసిన గీత దాటదు. ఢిల్లీ గీసిన గీత ముఖ్యమంత్రి దాటరు. ఒక్క ఎమ్మెల్సీ వదులుకోవడం వల్ల రాబోయే ఎన్నికల్లో వచ్చే లాభమెంత? అనే కోణం, అంచనా ప్రకారమే ఈ నిర్ణయం తెరపైకి వచ్చింది.

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతామని రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆనాడు పోలీసు కాల్పుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తామనడం మరింత విడ్డూరంగా ఉంది. ఆయన వ్యవహారం 'తన్నినవాడే ఓదార్చినట్టు'గా ఉంది. 40 ఏండ్ల తర్వాత ఆ పార్టీకి బాధితుల కుటుంబాలు గుర్తుకొచ్చాయి. హామీలను నెరవేర్చడం కంటే.. దగ్గరి దారిలో ప్రజల మన్ననలు పొందాలని, ప్రజలు నిరాశకు లోనుకాకముందే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలనే ఆలోచన రేవంత్‌రెడ్డి సర్కారులో స్పష్టంగా కనిపిస్తున్నది. మరి ఈ వ్యూహం ఎలాంటి ఫలితాలిస్తుందో వేచిచూడాలి.




## కాంగ్రెస్‌పై అవిశ్వాస తీర్మానం

> హస్తం పార్టీకి దేశవ్యాప్తంగా దెబ్బ మీద దెబ్బ తగులుతున్నది. ఇండియా కూటమిలోని పార్టీలు వరుసగా కాంగ్రెస్‌పై 'అవిశ్వాస తీర్మానం' ప్రవేశ పెడుతున్నాయి. మొన్న పశ్చిమబెంగాల్, నిన్న పంజాబ్, నేడు ఢిల్లీ.. ఇలా హస్తం పార్టీ మిత్రపక్షాలైన అన్ని ప్రాంతీయ పార్టీలు ఒంటరి పోరుకే మొగ్గుచూపుతున్నాయి. కాంగ్రెస్‌పై, రాహుల్‌పై ఆ పార్టీలకు నమ్మకమే లేదు. మోదీ హటావో కంటే.. కాంగ్రెస్ హటావో అన్న నినాదంతోనే ఇండియా కూటమి ముందుకుపోతున్నది.



**- షెహజాద్ పూనావాలా,** బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి